క్లుప్తంగా

సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ



చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

చిత్తూరు కార్పొరేషన్: చిత్తూరు రూరల్ మండలం నాయనిచెరువు పంచాయతీకి చెందిన వనిత గోవిందరాజుల కుమారుడు గగన్ (9నెలలు) మూర్ఛ వ్యాధితో చికిత్స పొందుతూ ఇటీవల చనిపోయాడు. దీంతో ఆ కుటుంబానికి ముఖ్యమంత్రి సహాయనిధి కింద మంజూరైన రూ.లక్ష చెక్కును ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మంగళవారం తన నివాసంలో అందజేశారు.

పుత్తూరుకు వెళ్లి పింఛను పంపిణీ



పింఛన్ అందజేస్తున్న వలంటీర్ రవితేజ

గుడిపాల: మండలంలోని బొమ్మసముద్రం దళితవాడకు చెందిన సులోచనకు తిరుపతిలోని స్విమ్స్‌లో డయాలసిస్ చేసుకుంటోంది. గుడిపాల నుంచి తిరుపతి వెళ్లి రావడం దూరాభారమని తలచి పుత్తూరులోని బంధువుల ఇంటి నుంచి డయాలసిస్‌కు వెళ్లి వస్తోంది. ఈ నేపథ్యంలో మంగళవారం పుత్తూరుకు వెళ్లి వలంటీర్ రవితేజ ఆమెకు డయాలసిస్ పింఛన్ రూ.10వేలు అందజేశాడు.

దాచూరి రామిరెడ్డి సేవలు చిరస్మరణీయం



దాచూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న యూటీఎఫ్ నాయకులు

ఐరాల: ఉపాధ్యాయులకు యూటీఎఫ్ వ్యవస్థాపకులు దివంగత దాచూరి రామిరెడ్డి అందించిన సేవలు చిరస్మరణీయమని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సోమశేఖర్‌నాయుడు స్మరించారు. మంగళవారం స్థానిక ప్రాథమిక పాఠశాలలో దాచూరి వర్ధంతి నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన సేవలను ప్రస్తుతించారు.దాచూరి అన్ని కేడర్ల ఉపాధ్యాయులను కలిపి ఒకే సంఘంగా ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్)ను స్థాపించారన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ మండల అధ్యక్షుడు మోహన్, ప్రధాన కార్యదర్శి అరుణ్, సీనియర్ నాయకులు కృష్ణారెడ్డి, జగన్నాథనాయుడు, ప్రభాకర్ పాల్గొన్నారు.

బేకరీ వ్యర్థాలతో పూడిపోయిన కాలువ



బ్రాహ్మణ వీధిలోని కాలువలో వ్యర్థాలు

చిత్తూరు అర్బన్: చిత్తూరులో 18వ డివిజన్‌లోని బ్రాహ్మణవీధిలో కాలువల పరిస్థితి అధ్వానంగా ఉంటోంది. ఇక్కడున్న ఓ బేకరీ నుంచి వ్యర్థాలన్నీ నేరుగా కాలువలోకి పడేస్తున్నారు. ఫలితంగా కాలువ పూడిపోయి, ఇళ్ల నుంచి కాలువలోకి వెళ్లే మురుగునీళ్లు ఎక్కడికక్కడే నిలిచిపోయింది. కార్పొరేషన్ సిబ్బంది సైతం సకాలంలో కాలువ శుభ్రం చేయకపోవడంతో దుర్గంధం చిమ్ముతోందని స్థానికులు వాపోతున్నారు. కోడిగుడ్డు వ్యర్థాలు, రసాయనాలు, చెడిపోయిన బ్రెడ్, కేక్ ముక్కలను కాలువలో పడేయడం వల్లే సమస్య వస్తోందని కాలనీ వాసులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

తరగతులు ప్రారంభం



పీసీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహిస్తున్న తరగతి

చిత్తూరు కలెక్టరేట్ : ఇంటర్‌లో ఫెయిల్, ఇంప్రూవ్‌మెంట్ విద్యార్థులకు మంగళవారం జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో తరగతులు ప్రారంభమయ్యాయి. ఈ తరగతులను ఇంటర్మీడియెట్ అధికారులు రమేష్, దయానందరాజు, కేజీబీవీ, మోడల్ స్కూల్స్, గురుకుల విద్యాసంస్థల అధికారులు పర్యవేక్షించారు. ఫెయిల్ అయిన విద్యార్థులను ఉత్తీర్ణులు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తోందన్నారు.

ద్రౌపదీదేవి కల్యాణం రేపు

బంగారుపాళెం: మండలంలోని కరిడివారిపల్లెలో గురువారం మహాభారత ఉత్సవాలలో భాగంగా గురువారం ద్రౌపదీదేవి కల్యాణోత్సవం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు, గ్రామస్తులు తెలిపారు. ధర్మరాజుల ఆలయంలో ఉదయం ప్రత్యేక పూజా కార్యక్రమాల అనంతరం మధ్యాహ్నం 3 గంటలకు కల్యాణోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు.

‘ధన’ం మూలం..‘లక్ష్మి’ జగత్!



చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయం

- బోర్లు వేసి కనెక్షన్లు ఇవ్వకుంటే ఎలా..?
- అద్దె నీటి ట్యాంకర్లతో ఖజానాకు గండి
- బోరుమంటున్న కార్పొరేటర్లు
- రోడ్డు పనులకు మామూళ్లు ఇవ్వాల్సిందేనా..!
- చేయి తడపనిదే సంతకాలు పెట్టనంటున్న అధికారి
- ఇదీ చిత్తూరు కార్పొరేషన్‌లో ఇంజినీరింగ్ విభాగం తీరు

చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయంలోని ఇంజినీరింగ్ విభాగానికి అవినీతి చీడ పట్టుకుంది. ప్రజల దాహార్తి తీర్చేందుకు వేసిన బోర్లకు అధికారులు ఇప్పటి వరకు వాటికి మోటార్లు బిగించలేదు. మోటార్లు బిగించాలంటే మాకేంటి..అసలు మాకేంటి..!? అంటూ బహిరంగంగా ‘ధన’ దాహంతో వెంపర్లాడుతున్నారు. ‘లక్ష్మి’ కటాక్షం లేనిదే బోరు మోటార్ల కనెక్షన్లకు మోక్షం లభించడం లేదని కార్పొరేటర్లు గగ్గోలు పెడుతున్నారు. ఇంజినీరింగ్ విభాగానికి చెందిన ఓ ప్రధాన అధికారి ఈ వసూళ్ల పర్వానికి దిగడంతో కిందిస్థాయి సిబ్బంది ఏం చేయాలో తెలియక తలలు పట్టుకుంటున్నారు. –చిత్తూరు అర్బన్

ఆమ్యామ్యా ఇవ్వనిదే..

నగరంలో రోడ్డు నిర్మాణాలు, కాలువలతో పాటు అభివృద్ధి పనులు ఏం చేయాలన్నా ఇంజినీరింగ్ విభాగమే కీలకం. ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారుల నుంచి వచ్చే సమస్యలను పరిష్కరించడంలో ఇంజినీరు ప్రధాన పాత్ర పోషించాల్సి ఉంది. అలాగే పనులు పూర్తయ్యాక కాంట్రాక్టర్లకు సకాలంలో బిల్లులూ మంజూరు చేయాలి. అయితే చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో కొన్ని నెలలుగా ఇంజినీరింగ్ విభాగంలోని ఓ ప్రముఖ అధికారి (లక్షన్నర వరకూ జీతం) వసూళ్ల పర్వానికి తెరతీశారు. వర్క్ ఆర్డర్లు ఇవ్వడం నుంచి మెజర్‌మెంట్ పుస్తకాలు (ఎం–బుక్) నమోదు, బిల్లులు పెట్టడం.. ఇలా ప్రతి ఫైలుకూ బహిరంగంగానే మామూళ్లు అడుగుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అభివృద్ధి పనులకు సంబంధించిన పనుల్లో తనకు తొలుత 5 శాతం వాటా ఇస్తే తప్ప సంతకాలు పెట్టేది లేదంటూ భీష్మించుని కూర్చున్నారు. ఈ అధికారి తీరుచూసి ఒకరిద్దరు సిబ్బంది సైతం ప్రతి పనికీ మామూళ్లు అడగటం ప్రారంభించారు. పలు కాలనీల్లో విద్యుత్ లైన్లు ఇవ్వడానికి స్తంభాలను ఏర్పాటు చేయాల్సి ఉంది. ట్రాన్స్‌కో అధికారులకు కార్పొరేషన్ యంత్రాంగం డబ్బులు చెల్లిస్తే తప్ప విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయలేని పరిస్థితి. వీటిని అంచనాలు తయారుచేస్తే తనకు ఆదాయం లేదని భావించిన అధికారి ఫైళ్లను పక్కన పడేశారు.

వేసవి ఇక్కట్లు

వేసవి దృష్ట్యా నగరవాసులకు నీటి సమస్య రాకుండా ఉండేందుకు స్థానిక ఎమ్మెల్యే ఆదేశాలతో పాలకవర్గం పలుచోట్ల బోర్లను డ్రిల్ చేయాలని నిర్ణయించింది. నగరంలోని 10, 12, 16, 17, 18, 23, 47, 48 డివిజన్లలో ఎనిమిది ప్రాంతాల్లో బోర్లను డ్రిల్ చేసిన ఇంజినీరింగ్ అధికారులు.. నెల రోజులు కావస్తున్నా ఇప్పటి వరకు వీటికి మోటార్లు బిగించలేదు. బోర్లలో పుష్కలంగా నీళ్లు పడ్డా.. మోటార్లు బిగించకపోవడంతో స్థానికులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఇదే విషయాన్ని పలువురు కార్పొరేటర్లు ఇంజినీరింగ్ అధికారిని నిలదీసినా ప్రయోజనం లేకపోవడంతో ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేయడానికి సిద్ధమవుతున్నారు. పైగా అద్దె నీటి ట్యాంకర్లను ఇష్టానుసారం తిప్పుతూ కార్పొరేషన్ ఖజానాకు గండి గొడుతున్నారనే విమర్శలొస్తున్నాయి. ఇప్పటికైనా ఇంజినీరింగ్ విభాగాన్ని ప్రక్షాళన చేసి, పరిస్థితిని చక్కదిద్దకపోతే.. ప్రజలను తీసుకొచ్చి కార్యాలయం వద్దే కూర్చుంటానంటూ ఓ కార్పొరేటర్ హెచ్చరించినట్లు సమాచారం. మరి అధికారులు దీనిపై ఎలా స్పందిస్తారో వేచి చూడాలి.

పైపులైను మార్చేదెన్నడో?



32వ డివిజన్‌లో మురుగునీటి కాలువ వద్ద పైపులైను లీకేజీ

చిత్తూరులోని 32 డివిజన్‌లో ఇటీవల మురుగు నీటి కాలువ పక్కనే నీటి పైపులైను ఇలా లీకేజీ అవుతోంది. పైపులైను పూర్తిగా తుప్పుపట్టిపోయింది. తాత్కాలికంగా పైపులైను లీకేజీని అధికారులు అరికట్టారు. చిన్నపాటి పైపులైన్లు మార్చడానికి ఓ రూ.30 వేలు ఉంటే సరిపోతాయి. వాస్తవానికి కార్పొరేషన్‌లో నిధులకు కొరత లేదు. కానీ ఇందులో తనకు వాటా రాలేదనే కారణంగా అధికారి పైపులైను మార్చకుండా వదిలేశారు. మరోమారు లీకేజీ అయితే బోరునీటితో పాటు కాలువనీళ్లు కూడా పైపులైనులో కలిసిపోయి కలుషితమయ్యే ప్రమాదం పొంచి ఉంది.

చర్యలు తీసుకుంటాం

ఇంజినీరింగ్ విభాగంలో అవినీతి ఆరోపణలు ఉంటే కచ్చితంగా విచారణ చేసి చర్యలు తీసుకుంటా. బోర్లకు మోటార్లు ఎందుకు బిగించలేదు..? అద్దె నీటి ట్యాంకర్ల పరిస్థితి ఏమిటని సంబంధిత అధికారి నుంచి సంజాయిషీ కోరుతాం. ప్రజల నుంచి కార్పొరేటర్ వరకు ఏదైనా ఇబ్బంది ఉంటే నేరుగా నా దృష్టికి తీసుకురండి. సమస్య పరిష్కరిస్తాం.

– డాక్టర్ అరుణ, కమిషనర్, చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్

ఘనంగా గంగజాతర



గంగమ్మను దర్శించుకుంటున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

చిత్తూరు రూరల్: చిత్తూరు నగరం సంజయ్ గాంధీ నగర్ కాలనీలో మంగళవారం గంగజాతర ప్రారంభమైంది. తొలుత స్థానికులు, పెద్దలు తొలిపూజ చేసి తెరను ప్రారంభించారు. భక్తులు ఊరేగింపుగా వచ్చి అంబలి పోసి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అమ్మవారికి కర్పూర నీరాజనాలు సమర్పించి దర్శించుకున్నారు. జాతర నిర్వాహకులు ఆయనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ హరిణి రెడ్డి, నాయకులు కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

చల్లంగా చూడు గంగమ్మ తల్లీ!

తవణంపల్లె: చల్లంగా చూడు గంగమ్మ తల్లీ! అంటూ మంగళవారం మండలంలోని టి.పుత్తూరులో సత్యమ్మకు అభిషేకం, విశేష పూజలు చేశారు. సత్యమ్మకు, త్రిశూలానికి ప్రత్యేక అలంకరణ చేశారు. అనంతరం గ్రామస్తులు అంబలి, పూజాసామగ్రిని తెచ్చి ప్రదక్షిణతో సమర్పించారు. పూజారి పూజలు చేసి భక్తులకు అంబలి ప్రసాదాలు పంచిపెట్టారు. మూడు వారాలు అంబలి పోసి మొక్కులు చెల్లించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

గంగమ్మా! వర్షాలు కురిపించమ్మా..

గుడిపాల: పుష్కలంగా వర్షాలు కురిసి పంటలు బాగా పండేలా దీవించాలని కోరుతూ మంగళవారం మండలంలోని వెప్పాలమానుచేను గ్రామస్తులు గంగమ్మ దేవతకు ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం అమ్మవారికి అంబలి పోసి, పొంగళ్లు పెట్టి, ప్రత్యేకంగా అలంకరించి మొక్కు లు చెల్లించారు. మధ్యాహ్నం అన్నదానం చేశా రు. రాత్రి గెరిగ డ్యాన్స్, డ్రమ్స్‌ల మధ్య అమ్మవారిని ఊరేగించారు. బుధవారం మధ్యాహ్నం వసంతాలతో అమ్మవారిని ఘనంగా ఊరేగిస్తామని గ్రామస్తులు చెప్పారు.



తవణంపల్లె : టి.పుత్తూరులో..



గుడిపాల : వెప్పాలమానుచేనులో గంగమ్మ

శిక్షణ, అవగాహనతోనే రోడ్డు ప్రమాదాల నివారణ

- డీఎల్ ట్రాక్ పనితీరుపై అవగాహన ముఖ్యం
- డీటీసీ నిరంజన్‌రెడ్డి



డ్రైవింగ్ స్కూల్ నిర్వాహకులతో మాట్లాడుతున్న డీటీసీ నిరంజన్‌రెడ్డి

చిత్తూరు రూరల్: సరైన శిక్షణ, అవగాహనతోనే రోడ్డు ప్రమాదాల నివారణ సాధ్యమవుతుందని, డ్రైవింగ్ శిక్షణలో ఉన్నవారికి మెళకువలు నేర్పి, రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేయాలని డీటీసీ నిరంజన్‌రెడ్డి అన్నారు. చిత్తూరులోని తన కార్యాలయంలో మంగళవారం డ్రైవింగ్ స్కూల్ నిర్వాహకులతో ఆయన మాట్లాడారు. డ్రైవింగ్ నేర్చుకునేందుకు వచ్చిన వారికి ముందుగా ట్రాఫిక్ రూల్స్, రోడ్డు భద్రత సూచనలు తదితర అంశాలను తెలియజేయాలన్నారు. దీంతో పాటు కొత్తగా డీఎల్ ఆటోమేటిక్ ట్రాక్ పనితీరును వివరించాలన్నారు. ఈ డీఎల్‌లో ఎక్కువగా ఎక్కడ తప్పిదాలు చేస్తున్నారో..తెలియజేయాల్సి ఉందన్నారు. స్కూళ్ల వాహనాలు మంచి కండిషన్‌లో ఉండాలన్నారు. వాహన చట్టం, శాఖ నియమ నిబంధనలను తప్పక పాటించాలని, లేనిపక్షంలో చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో ఎంవీఐలు రాజేశ్వర రావు, వాసుదేవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న డీఐఓ రవిరాజు

యాదమరి: సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై వైద్యసిబ్బంది, ఆశా కార్యకర్తలకు జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి రవిరాజు అవగాహన కల్పించారు. మంగళవారం ఆయన మండలంలోని సంతగేటు ప్రభుత్వాసుపత్రిలో ఈ కార్యక్రమం నిర్వహించారు. గ్రామీణ ప్రాంతాలలో బరువు, ఎత్తు తక్కువగా ఉన్న గర్భవతులు, కిశోర బాలికలకు ఎలాంటి వైద్య సేవలు అందించాలో వివరించారు. ప్రధానంగా గర్భం దాల్చిన నాటి నుంచి కాన్పు అయ్యేవరకు గర్భిణులకు అందించాల్సిన సేవలను తెలియజేశారు. అలాగే అందించిన సేవలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. గర్భవతులకు వైద్య పరీక్షలు నిర్వహించిన తరువాత వారికి రక్తహీనత తక్కువగా వుంటే వారికి ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారం అందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు సురేఖ, సీహెచ్ఓ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

గుండ్లపల్లెలో ‘ఫ్యామిలీ డాక్టర్’



ఐరాల : వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి పూర్ణలత



తవణంపల్లె : అరగొండలో రోగులతో మాట్లాడుతున్న డాక్టర్

ఐరాల: మండలంలోని గుండ్లపల్లెలో మంగళవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి పూర్ణలత 104 వైద్య శిబిరంలో 50 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లలకు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు వైద్య పరీక్షలు చేశారు. ఇళ్ల వద్దకే వెళ్లి రోగుల ఆరోగ్య పరిస్థితులు తెలుసుకుని సూచనలు–సలహాలు ఇచ్చారు. వడదెబ్బపై అవగాహన కల్పించారు. ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

అరగొండలో..

తవణంపల్లె: మండలంలోని అరగొండలో వైఎస్సార్ హెల్త్‌నెస్ సెంటర్‌లో మంగళవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. మండల వైద్యాధికారి డాక్టర్ వినయ్‌కుమార్ 75 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ, జ్వరపీడితులు డాక్టర్‌ను సంప్రదించి వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఎండాకాలంలో వడదెబ్బకు గురికాకుండా తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు సుబ్రమణ్యం రెడ్డి, ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

సచివాలయాన్ని తనిఖీ చేసిన జెడ్పీ సీఈఓ



నోటీస్ బోర్డును పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ

శ్రీరంగరాజపురం: మండలంలోని 49 కొత్తపల్లి సచివాలయాన్ని జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి మంగళవారం తనిఖీ చేశారు. పథకాల లబ్ధిదారుల వివరాలు, పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ నిబంధనల మేరకు సచివాలయ సిబ్బంది తప్పక యూనిఫాం ధరించాలని, సమయ పాలన పాటించాలని తెలిపారు. లబ్ధిదారులతో మాట్లాడి ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని సూచించారు. ఎంపీడీఓ కృష్ణయ్య, పంచాయతీ కార్యదర్శి బాలరాజు ఉన్నారు.

నేడు లారీ సంఘ నాయకుల నిరసన

చిత్తూరు రూరల్: విశాఖ ఉక్కుకోసం బుధవారం చిత్తూరు లారీ యజమానుల సంఘ నాయకులు నిరసన కార్యక్రమం నిర్వహించనున్నారు. ఉదయం 9 నుంచి 11 గంటల వరకు లారీలను ఎక్కడిక్కడిని నిలిపివేస్తామని, దీనికి అందరూ సహకరించాలని సంఘ నాయకులు కోరారు.

వేడుకగా తిరుపతి గంగమ్మ జాతర





తిరుపతి గంగమ్మకు పూజలు చేస్తున్న భక్తులు, వేకువ జామున పుర వీధులలో ఊరేగిన ముత్యాలమ్మ

యాదమరి: యాదమరిలో తిరుపతి గంగమ్మ జాతర వేడుకగా మంగళవారం ప్రారంభమైంది. వేకువ జామున ముత్యాలమ్మను పుర వీధులలో ఊరేగించారు. అనంతరం స్థానిక మెయిన్ బజారులోని అమ్మవారి విశ్వరూపాన్ని ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం మహిళలు అమ్మవారికి అంబలి పోసి మొక్కులు చెల్లించారు. సాయంత్రం పొంగళ్లు పెట్టి నైవేద్యం సమర్పించారు. రాత్రి అమ్మవారికి పిండిదీపాలు వెలిగించి పూజలు చేశారు. అమ్మవారికి జెడ్పీ వైస్ చైర్మన్ ధనంజయ రెడ్డి, మండల నాయకులు ప్రత్యేక పూజలు చేశారు.

నేడు నిమజ్జనం

బుధవారం అమ్మవారి నిమజ్జన కార్యక్రమం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉదయం ఓం శక్తి అమ్మవారి ఆలయంలో అమ్మవారి మాలధారణ భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి, మధాహ్నం అన్నదానం చేస్తారు. సాయంత్రం మాలధారణ భక్తులు అమ్మవారికి మాలలు సమర్పించిన అనంతరం ఊరేగింపుగా తీసుకెళ్లి పెరుమాళ్లపల్లెలో నిమజ్జనం చేస్తారు.

రెవెన్యూ సమస్యల పరిష్కారానికి చర్యలు

- సమావేశంలో జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు
- 13న జాతీయ లోక్ అదాలత్ విజయవంతం చేయాలని పిలుపు



మాట్లాడుతున్న న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కరుణకుమార్

చిత్తూరు అర్బన్/ చిత్తూరు కలెక్టరేట్ : రెవెన్యూ సమస్యల పరిష్కారానికి సంబంధిత తహసీల్దార్లు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశంలో ఈనెల 13న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌లో భూ సమస్యల పరిష్కారానికి తీసుకోవలసిన చర్యలపై తహసీల్దార్లు, జీపీల తో ఆయన సమీక్షించారు. జిల్లాలో వివిధ మండలాల్లో రెవెన్యూ భూ సమస్యలకు సంబంధించి 365 కేసులు కోర్టులో నడుస్తున్నాయన్నారు. మండల పరిధిలో ఉన్న భూ సమస్యల కేసులకు సంబంధించి పిటీషనర్లతో తహసీల్దార్లు మాట్లాడి వారికి అవగాహన కల్పించాలన్నారు.

లోక్ అదాలత్ తీర్పులు సుప్రీం తీర్పులతో సమానం

జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కరుణకుమార్ మాట్లాడుతూ, లోక్ అదాలత్‌లో ఇచ్చే తీర్పు సుప్రీంకోర్టులో ఇచ్చిన తీర్పుతో సమానమన్నారు. తొలుత తహసీల్దార్లు ఆయా మండలాలకు సంబంధించి కోర్టులలో రెవెన్యూ కేసులకు సంబంధించి జీపీలతో చర్చిస్తే ఏయే కేసులు పరిష్కరించుకోవచ్చనేది అవగాహన కలుగుతుందన్నారు.

లోక్ అదాలత్‌తో సమయం ఆదా : డీఆర్వో

డీఆర్వో రాజశేఖర్ మాట్లాడుతూ, తహసీల్దార్లు కోర్టులో పెండింగ్‌లో ఉన్న ప్రీ లిటిగేషన్ కేసులు గుర్తించి కక్షిదారులతో మాట్లాడాలన్నారు. లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కారానికి కోర్టు ఫీజులు, సమయం ఆదా అవుతుందనేది ప్రధానంగా చెప్పాలన్నారు. అనంతరం తన కార్యాలయంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి లోక్ అదాలత్ విజయవంతం చేయడంపై మాట్లాడారు. ఇప్పటివరకు ఉమ్మడి చిత్తూరు జిల్లాలో వివిధ రకాల కేసులు సంబంధించి 12,138 కేసులను గుర్తించామని, ఇందులో 10,736 కేసులకు సంబంధించి నోటీసులు ఇచ్చినట్లు చెప్పారు.

ప్రజారోగ్యానికి మూల స్తంభాలు



పూతలపట్టు : సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ ప్రవీణ



ఐరాల : ఫైలేరియా వ్యాధిగ్రస్తులకు కిట్లను అందజేస్తున్న వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్



తవణంపల్లె : మాట్లాడుతున్న వైద్యాధికారి ధాత్రేయచౌదరి

బంగారుపాళెం: ఆశా కార్యకర్తలు ప్రజా ఆరోగ్యానికి మూల స్తంభాలని మండల వైద్యాధికారి డాక్టర్ లోహిత్ చెంగల్‌రాయస్ అన్నారు. మండలంలోని తుంబకుప్పం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో మంగళవారం ఆశా డే సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, క్షేత్ర స్థాయిలో ప్రజల ఆరోగ్యం కోసం ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. ప్రధానంగా తల్లీ బిడ్డ ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. గర్భవతుల నమోదు, హైరిస్క్ గర్భవతులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రసవ సమయాల్లో 108లో గర్భవతులను సమీప ఆసుపత్రుల్లో చేర్పించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. మాతా– శిశు మరణాలను నివారించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుందన్నారు. కార్యక్రమంలో ఫ్యామిలీ డాక్టర్ రమేష్, సీహెచ్ఓ షమీమ్, డీపీఎంఓ మణి, ఎంపీహెచ్ఈఓలు బృహస్పతి, రమేష్‌బాబు, సూపర్‌వైజర్లు భగవద్గీత, సుమతి, మండల పర్యవేక్షకులు హరికృష్ణ, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

పూతలపట్టులో..

పూతలపట్టు: పూతలపట్టు పీహెచ్‌సీలో మంగళవారం ఆశా డే నిర్వహించారు. గర్భవతులు, బాలింతలకు మరింత మెరుగైన సేవలును అందివ్వాలని డాక్టర్ ప్రవీణ్ అన్నారు.హైరిస్క్ కేసులను పర్యవేక్షిస్తూ, వారి ఆరోగ్య వివరాలను ఎప్పటికప్పుడు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ ఆఫీసర్ శ్రీనివాసమూర్తి, సిబ్బంది నూర్జహాన్, శేషాద్రి, నీహారిక, దయాకర్‌రెడ్డి, సుస్మిత పాల్గొన్నారు.

ఐరాలలో..

ఐరాల: దోమల ద్వారా బోదకాలు (ఫైలేరియా) వ్యాధి సంక్రమిస్తుందని, దీని నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ అన్నారు. మంగళవారం పీహెచ్‌సీలో ఆశా డే నిర్వహించారు. ఫైలేరియాపై ఆశా వర్కర్లకు అవగాహన కల్పించారు. అలాగే పీహెచ్‌సీ పరిధిలోని గ్రామాల్లో పరిసరాల శుభ్రతతోపాటు వ్యక్తిగత శుభ్రత కూడా పాటించేలా ప్రజలకు అవగాహన కల్పించాలని ఆశా వర్కర్లుకు సూచించారు. అనంతరం ఫైలేరియా వ్యాధిగ్రస్తులకు కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ శంకరమ్మ, పీహెచ్ఎన్ జీవకళ, ఎల్‌డీసీ ఉమాపతి, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

సంరక్షణపై ప్రత్యేక దృష్టి

తవణంపల్లె: బాలింతలు, శిశు సంరక్షణపై ఆరోగ్య కార్యకర్తలు, ఆశావర్కర్లు ప్రత్యేక దృష్టి సారించాలని మండల వైద్యాధికారి డాక్టర్ ధాత్రేయచౌదరి అన్నారు. మంగళవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశా డే నిర్వహించారు. ధాత్రేయచౌదరి మాట్లాడుతూ, గర్భవతులు ప్రసవించిన తర్వాత బాలింతలను, శిశువులను ఆరుసార్లు గృహ సందర్శన చేసి ఆరోగ్య సంరక్షణకు తీసుకోవాల్సిన చర్యలను తెలియజేయాలన్నారు. జననీ శిశు సంక్షేమ పథకం గురించి తెలియజేశారు. కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ ప్రియాంక, డాక్టర్ మోహన వేలు, పీహెచ్ఎన్ భారతి, ఆరోగ్య పర్యవేక్షకులు రాజశేఖర్, అమరావతి, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాసులు, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.